క్లుప్తంగా

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

జామి: మండలంలోని చింతాడ గ్రామంలో సచివాలయ నూతన భవనం, కలగాడలో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించనున్నారని ఎంపీడీఓ ఎం.సతీష్ గురువారం తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు. అలాగే కలగాడలో నిర్వహించే జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శిస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

21 పెదమానాపురంలో..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం సాయంత్రం ప్రారంభిస్తారని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి తెలిపారు. స్థానిక సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

భీమసింగిలో పశువైద్య శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి నరేష్

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో పశువైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో గురువారం పశువైద్యశిబిరం నిర్వ హించారు. శిబిరంలో 50 పశువు లకు వివిధ చికిత్సలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ దూడలకు సకాలంలో నట్టల నివారణ మందు పట్టించాలని పాడిరైతులకు సూచించారు. పశువులు ఎదకు రావడాన్ని సకాలంలో గుర్తించి కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు వేయించాలన్నారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురు పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సిబ్బందికి నగదు పురస్కారాలు



కండక్టర్ రమణకు చెక్ అందజేస్తున్న డీపీటీఓ అప్పలనారాయణ

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రభుత్వం నగదు పురస్కారాలు అందజేసింది. సిబ్బందిని స్థానిక ఆర్టీసీ బస్‌డిపోలో మేనేజర్ కె.రమేష్ నేతృత్వంలో గురువారం అభినందన సభ నిర్వహించారు. కండక్టర్లు బి.వి.రమణ, వి.ఎస్.రావు, కె.ఈ.రావు, డ్రైవర్లు కె.ఎల్.వి.శాస్త్రి, జి.ఈ.రావు, ఎస్.ఆర్.వి.రాజుకు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీఓ) సీహెచ్.అప్పలనారాయణ చెక్కులు అందజేసి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యిందన్న నిర్లక్ష్యం వదిలి, ఆర్టీసీని ప్రభుత్వంలో ప్రత్యేకంగా నిలిపాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు డిపోలో అన్ని విభాగాలను డీపీటీఓ తనిఖీ చేసి, డిపో అభివృద్ధికి కొన్ని సూచనలు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు సీహెచ్.కృష్ణారావు, వెంకటరావు, ఇన్‌స్పెక్టర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జామి: కుమరాం ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కుమరాం ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గరివిడి సబ్‌స్టేషన్ పరిధిలో ...

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు గరివిడి మం డలంలో పలుగ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.రమణ గురువారం తెలిపారు. గరివిడి పట్టణంతో పాటు డీఎఫ్ఎస్, కందిపేట, కొండలక్ష్మీపురం, బాగువలస, కుమరాం, వెదుళ్లవలస, పాలవలస, ఆవగూడెం, తాటిగూడ, గెడ్డపువ లస, వి.పి.రేగ, విజయరాంపురం,సీలాద్రిపురం గ్రామాలతో పాటు గుర్ల మండలంలోని పెద బంటుపల్లి, లవిడాం, డి.కనపాక గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాస్త్రం తయారీపై వివరించారు. ఈ కషాయంతో ఆకుముడత, పచ్చ పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది గాయత్రి, రామలక్ష్మి, కృష్ణ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు



గంట్యాడ: దిగువ కొండపర్తిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి



వేపాడ: వావిలపాడులో నిర్వహించిన శిబిరానికి తరలివచ్చిన ప్రజలు



కొత్తవలస: మంగళపాలెంలో మహిళకు మందుల కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్యసేవలను ప్రభుత్వం చేరువ చేసిందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మ న్ నెక్కల నాయుడు బాబు, మంత్రి బొత్స సత్యనారాయణ తనయుడు డాక్టర్ సందీప్‌బాబు, పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమంలో భాగం వైద్య శిబిరాలు గ్రామాల్లో కొనసాగుతున్నాయి. కొత్తవలస మండలంలోని మంగళపాలెం, ఎల్.కోట మండలంలోని రేగ, వేపాడ మండలంలోని వావిలపాడు, గరివిడి మండలంలోని ఏనుగువలస, దత్తిరాజేరు మండలంలోని గడసాం, మెరకముడిదాం మండలంలోని ఊటపల్లి, గుర్ల మండలంలోని చింతపల్లిపేట, శృంగవరపుకోట మండలంలోని కొత్తూరు, గంట్యాడ మండలంలోని దిగువ కొండపర్తి గ్రామంలో, చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేటలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను, అక్కడ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించారు. ప్రజలకు వైద్యులు అందిస్తున్న సేవలపై వైద్యాధికారులను ప్రజాప్రతినిధులు ఆరా తీశారు. అవసరమైన వారికి ఉచితంగా మందుల కిట్లను అందజేశా రు. గ్రామాల్లోనే ప్రజలకు సూపర్ స్పెషాలటీ వైద్యసేవలు అందిస్తున్నామని, శిబిరాలను సద్వినియోగం చేసు కోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు.

– కొత్తవలస/ లక్కవరపుకోట/వేపాడ/చీపురుపల్లి రూరల్(గరివిడి)/ చీపురుపల్లి/ దత్తిరాజేరు/మెరకముడిదాం/గుర్ల/ గంట్యాడ/ శృంగవరపుకోట



చీపురుపల్లిరూరల్(గరివిడి): ఏనుగువలసలో వృద్ధుడికి మందులు అందజేస్తున్న బొత్స సందీప్‌బాబు



గుర్ల: చింతపల్లిపేటలో వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న సర్పంచ్ జమ్ము శ్రీదేవి, నాయకులు



లక్కవరపుకోట: రేగ శిబిరంలో వృద్ధుడికి మందులు అందజేస్తున్న వైద్యులు, గ్రామ పెద్దలు



చీపురుపల్లి: వంగపల్లిపేటలోని శిబిరంలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



శృంగవరపుకోట: కొత్తూరులో వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



వేపాడ: వావిలపాడులో మందుల కిట్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు,ఎంపీపీ సత్యవంతుడు



దత్తిరాజేరు: గడసాంలో యువడికి కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, సర్పంచ్ దీపిక



మెరకముడిదాం: ఊటపల్లిలో వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న సందీప్, నాయకులు, ప్రజాప్రతినిధులు

ప్రకృతి వ్యవసాయమే మేలు

మెంటాడ(గజపతినగరం రూరల్): పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని పిడిశీల క్లస్టర్ ప్రకృతి వ్యవసాయ అధికారి సత్యవతి అన్నారు. మండలంలోని సీతారామపురం గ్రామంలో రైతు లకు బ్రహ్మాస్త్రం కషాయం తయా రీపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి తన సహజమైన సార వంతాన్ని కోల్పోకుండా ఉంటుందని, ఈ విధానంలో సాగు చేసే పంటలను ఆహారంగా తీసు కునే వారు ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు, పం ట ఎదుగుదలకు బ్రహ్మాస్త్రం కషాయం బాగా పని చేస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తులసి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నేడు మండల సర్వ సభ్య సమావేశం

వేపాడ: ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్ గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం రేపు

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం ఈనెల 21న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్కవరపుకోట మండలం సంతోపేట జంక్షన్ సమీపంలోని సాంబ వి లేవుట్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి అతిథులుగా పార్టీ రీజినల్ కో- ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు,జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని అయిదు మండలాల ఎంపీపీలు ,జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు, పార్టీ మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

జామి: ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్)పై ఆపథకం గజపతినగరం ఏపీడీ జనార్దనరావు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టిన పనులపై కొద్ది రోజులుగా ఆడిట్ బృందం తనిఖీలు చేసింది. ఈ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు, పనుల్లో లోపాలను ఎంపీడీఓ ఎం.సతీష్ అధ్యక్షత న ఆడిట్ సిబ్బంది ప్రజావేదికలో వివరించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల్లో చాలా వాటికి ట్రీగార్డులు లేవని, పలు గ్రామాల్లో మొక్కలు చనిపోయినట్లు గుర్తించామని ఆడిట్ సిబ్బంది తెలిపారు.ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఉపాధి హామీ డీవీఓ రవీంద్ర, ఎస్.కోట ఏపీడీ శారదాదేవి, పీఆర్ డీఈ స్వామినాయుడు, ఏపీఓలు శేఖర్, కిరణ్మయి, హౌసింగ్ ఏఈ వెంకటరావు, ఎస్ఆర్‌పీ మాధవ రావు, డీఆర్పీలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ప్రజావేదిక కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు,అధికారులు

ఎస్.కోటలో రెడ్‌క్రాస్ బ్రాంచ్ ఏర్పాటు

శృంగవరపుకోట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్‌ను ఎస్.కోటలో ఏర్పాటు చేశారు. బ్రాంచ్ కమిటీని స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో తహసీల్దార్ డి.శ్రీని వాసరావు అధ్యక్షతన, జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు డి.సూర్యారావు పర్యవేక్షణలో బుధవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాంచ్ యూనిట్ చైర్మ న్‌గా డాక్టర్ పి.వరలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా ఏ.మల్లేశ్వరరావు, ట్రెజరర్‌గా శ్రీనాధు వెంకటరావు, సెక్రటరీగా జి.ధనుంజయ్, కమిటీ సభ్యులుగా డాక్టర్ మళ్ల వేణు, డాక్టర్ వి.వి.ఎస్.అప్పలనాయుడు, ఎం.కొండలరావు, ఆర్.దుర్గాప్రసాద్, కె.అప్పలరాజు, కె.వి.జోగారావు, వానపల్లి రమేష్ ఎన్నికయ్యారు. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవీయ విలువలే పునాదులుగా రెడ్‌క్రాస్ సొసైటీ పనిచేస్తోందని, సొసైటీకి తన సహకారం అందిస్తానంటూ చెప్పారు. డిస్ట్రిక్ట్ మేనేజింగ్ కమిటీ (డీఎంసీ) మెంబర్ సూర్యారావు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ దేశవ్యాప్తంగా మానవాళి ఆరోగ్య రక్షణ, విపత్తుల్లో సహాయం అన్న రెండు ప్రధా నాంశాల్లో వివక్ష లేని సేవలు అందించే మహోన్నత సంస్థ అని అన్నారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ సభ్యులు అంతా తహసీల్దార్‌ను సన్మానించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ యూనిట్ కార్యవర్గ సభ్యులు

రూ.60 లక్షలతో తారురోడ్డు పునరుద్ధరణ

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామం తారు రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో ఆ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోమటిపల్లి–గర్భాం రహదారి నుంచి వంగర గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర ఉన్న తారురోడ్డు పూర్తిగా శిథిలమైంది. రోడ్డు గోతులమయం కావడంతో రాకపోకలు సాగిం చేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడాల్సి వచ్చేంది. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా వంగర గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు గ్రామస్తులు సమస్యను వివరించి, రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. తప్పకుండా సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అప్పట్లో హామీ ఇచ్చారు. హామీ మేరకు రోడ్డు పునరుద్ధరణకు ఏఎంసీ నిధులు రూ.60 లక్షలు మంజూరు చేయించారు.ఈ నిధులతో కొద్ది రోజుల క్రితమే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేశామని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు గురువారం తెలిపారు. గత ప్రభుత్వంలో పాలకుల చుట్టూ తిరిగినా రోడ్డు సమస్య పరిష్కారం కాలేదని, ఎమ్మెల్యే అప్పలనరసయ్య ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు వేయించారని సర్పంచ్ దత్తి నారాయణప్పలనాయుడు, జిల్లా టెలీకాం బోర్డు అడ్వయిజరీ కమిటీ మెంబర్ దత్తి చిరంజీవి, గ్రామస్తులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



కోమటిపల్లి-గర్భాం రహదారి నుంచి వంగర గ్రామానికి వేసిన తారురోడ్డు

మహా చండీదేవిగా అమ్మవారి దర్శనం



దత్తిరాజేరు: మరడాంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



జామి: జామి కనకదుర్గమ్మ ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



కొత్తవలస: రాజపాత్రునిపాలెంలో దుర్గాదేవి అంబలం పూజ చేస్తున్న భక్తులు

దత్తిరాజేరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మరడాం,పెదమానాపురం, కోమటిపల్లి, పెదకాద, గడసాం గ్రామాల్లోని దేవీ మండ పాల్లో అమ్మవారు గురువారం మహాచండీ అవతారంలో దర్శనమిచ్చారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండపాల్లో వేద పండితులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జామి కనకదుర్గమ్మ ఆలయంలో..

జామి: స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అర్చకులు భగవాన్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహా చండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.భీమసింగి కనకదుర్గమ్మ ఆలయం, అలమండ దుర్గామాత ఆలయాల్లో అమ్మవారు మహా చండీగా దర్శనమిచ్చారు.

రాజపాత్రునిపాలెంలో అంబలం పూజ

కొత్తవలస: మండలంలోని రాజపాత్రునిపాలెం గ్రామంలో దుర్గా భవానీ సేవా పీఠం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దుర్గాదేవి అంబలం పూజ నిర్వహించారు. చుట్టు పక్క గ్రామాలకు చెందిన సుమారు 600 మంది భవానీ మాలధారులు గురు భవాని లంక సత్తిరాజు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం



మహిళకు పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు

గుర్ల: ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్య వర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, డీఎల్‌డీఏ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు అన్నారు. మండలంలోని వల్లాపురం గ్రామం లో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. పథకాల కోసం ఎవరికీ రూపాయి లంచం ఇవ్వాల్సిన పని లేదని, ఎవరి సిఫార్సులూ అవసరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, ఈఓపీఆర్డీ గాయత్రి , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై ప్రత్యేక నిఘా

- మాదక ద్రవ్యాలతో అనర్థాలపై ఓ వైపు ప్రజల్లో అవగాహన
- మరోవైపు విస్తృతంగా తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు



రైల్వేస్టేషన్‌లో బ్యాగులు తనిఖీ చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

చీపురుపల్లి: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంతో పాటు రవాణాను అడ్డుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. గంజాయి, సారా విక్రయాలతో పాటు గ్రామాల్లో బెల్టు దుకాణాల నిరోధంపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాలతో చీపురుపల్లి సర్కిల్ పరిధిలో ఎస్ఈబీ ఆ దిశగా చర్యలు వేగవంతం చేసింది. చీపురుపల్లి ఎస్ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు నేతృత్వంలో సిబ్బంది చీపురుపల్లి, గరివిడి, మెర కముడిదాం మండలాల్లో మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా పెట్టారు. రోజూ బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాల్లో, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానం ఉన్న ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పంపిస్తున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలవుతున్న నేపథ్యంలో కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వ హిస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. గతంలో సారా తయారు చేసే గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజ లను సారా జోలికి వెళ్లొద్దని ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

నియంత్రణకు టోల్‌ఫ్రీ నంబర్

మాదక ద్రవ్యాల వినియోగం, తరలింపుపై సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇదే విషయాన్ని సెబ్ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా బెల్టు దుకాణాలు నిర్వహించినా, సారా కాచినా, గంజాయి విక్రయించినా 14500 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా, గంజాయి విక్రయించినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా కేసులు నమోదు చేయక తప్పదని సీఐ హెచ్చరించారు.